# శ్యామల తెచ్చిన మార్పు

(కథానిక)

చౌదరిగారి పెద్దబ్బాయి చదువుకున్నందువలనే చెడిపోయాడంటే ఆశ్చర్యపడనవసరం లేదు. ఈ విషయం నేను అనటమే కాదు చౌదరిగారంతటివాడే నాతో స్వయంగా అన్నాడు.

“చూడు రాంబాబూ! ఆ చిన్నవాడికి అసలు చదువు రాలేదనుకుందాము. మా పెద్దాడయినా చదువుకున్నందుకు కొంచెము ఇంగిత జ్ఞానము కలిగివుండాలంటావా లేదా?” అని అన్నాడు చౌదరిగారు నాతో. పెద్దమనిషి వేసిన సూటి ప్రశ్నకు ఏమీ సమాధానం చెప్పలేక చివరకి వారితో ఏకీభవించాను.

చౌదరిగారి పెద్దబ్బాయి సుందరం (వాళ్ల ఊరిలో సుందరయ్య) నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు. అతడు బి. ఏ. పరీక్షకు ఎన్ని సార్లుగా కూర్చుంటున్నాడో కూడా తెలుసు. అతడు '42లో జైలుకు పోతూ నన్ను కూడా రమ్మనమని ఎంత బలవంతపెట్టిందీ నేను (బుద్ధిమంతుడనయి!) ఏవిధంగా రానన్నదీ కూడా నాకు ఇంకా జ్ఞాపకం ఉంది. సుందరం వయస్సులో చిన్నవాడయినా చాలా కష్టాలు పడ్డాడు. జీవితం యొక్క లోతుపాతులని బాగా అవగాహన చేసుకున్నాడు. ఇంటినుంచి తాను పూర్తిగా సంబంధం లేకుండా ఉంటున్నప్పుడు అతడు డబ్బు లేకుండా నికృష్టంగా జీవితం గడిపి ఈనాటికి మళ్ళీ ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకొని అంతంతమాత్రంగా జీవితాన్ని వెళ్లపోస్తున్నాడు. రోజులు మారినవి. సుందరం జీవితం సుఖంగా గడుస్తున్నది. ఒక డాక్టరుగారి ఇంట్లో ఒక భాగం అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఆ డాక్టరుగారికి ప్రాక్టీసు లేదు. తన దగ్గరకు వచ్చిన రోగులందరికీ ఆ వ్యాధులన్నిటికీ మూలకారణమయిన అశుభ్రత, అనారోగ్యం పోగొట్టుకొని డాక్టర్లకి పెట్టే డబ్బుతో బలమయిన ఆహారాన్ని తీసుకోమని నిజం చెప్పే అతని దగ్గరకు ఎవరు వస్తారు? డాక్టరుగారికి రాజకీయాలు అంటే మహాచెడ్డ చిరాకు. రాజకీయాలు స్వార్థపరులు సృష్టిస్తున్నవేకాని వేరే ఏమీ కావంటాడు. సుందరానికి ఆయనంటే మహా యిష్టం. సుందరాన్ని ఆ యింట్లో డాక్టరుగారి కంటే ఆయన కుమార్తె శ్యామల యింకా యెక్కువగా ఆకర్షించింది. డాక్టరుగారు చాలా ఉదార స్వభావుడు కనుక ఆ యింట్లో సుందరానికి చాలా చనువు దొరికింది. తనకు తీరిక సమయాల్లో డాక్టరుగారి పిల్లలందరికీ చదువు చెప్పుతుండేవాడు. అతడు చివరకి వాళ్ల యింట్లో మనిషిలాగా అయిపోయాడు. పిల్లలందరూ అతన్ని 'మామయ్యా' అని పిలిచేవాళ్లు. అతడు రెండు సంవత్సరాల క్రితం అక్కడకు వచ్చినప్పుడు శ్యామల అతన్ని ఏమంత ఆకర్షించలేదు. అప్పటికే శ్యామల బొద్దుగా ఉండేది. డాక్టరుగారు ఆ అమ్మాయిని దగ్గరకి పిలిచి తల నిమురుతూ సుందరం మామయ్యని కనిపెట్టి ఉండమని నవ్వుతూ చెప్పుతుండేవాడు. సుందరం డబ్బులు లేక ఎక్కడా ఉద్యోగం దొరకక బాధపడేరోజుల్లో డాక్టరుగారి ఇంట్లోనుంచి అనేకమారులు పారిపోయాడు. డాక్టరుగారు స్వయంగా వెదకి ఏ పార్కు బెంచీమీదో, ఏ సత్రం అరుగులమీదనో పరుండిన సుందరాన్ని లేపుకు వచ్చేవాడు. ఈ విధంగా చాలామార్లు జరిగింది.

ఈరోజున శ్యామల పెద్దదయింది. రోజూ కాలేజీకి వెళ్లుతుంది. ప్రతి సాయంత్రం ఆఫీసునుంచి వస్తూ ఆమెను స్వయంగా ఇంటికి తీసుకువస్తుంటాడు సుందరం. వస్తూవస్తూ దారిలో రెస్టారెంటులో కాఫీ త్రాగుతారు.

శ్యామల స్వభావం వేరు. ఆమె చాలా మితభాషి. మాట్లాడేది కొద్ది మాటలయినా అధికార యుక్తంగా మాట్లాడినట్లనిపించుతుంది.

మొవ్వ రాంబాబు

ఆమె తన వయస్సుకి కొంచెం పెద్దదిగా కనుపించినా అందుకు తగిన ధృఢత్వం ఆమెలో లేకపోలేదు. ఆమె ఇంట్లో పనిచేసుకునే సమయాల్లో ఆమెను ఒంటరిగా చూచేవాడు. తనను సుందరం చూస్తున్నాడని ఆమె తెలుసుకోగానే సిగ్గుపడేది. శ్యామల ఇంకా చిన్నపిల్ల కాదని నిర్ధారణ చేసుకునేవాడు. కాని ఆ ఇంట్లో తనకున్న స్థానం, శ్యామల నిర్మల స్వభావం చూచుకొని సంతృప్తి పడేవాడు. శ్యామల కొరకు ఎవరెవరు ఎక్కడెక్కడ వేచి ఉంటారో (కాలేజీ కుర్రాళ్ళు) అతడు గ్రహించుకోలేనంత మూర్ఖుడు కాదు. ఒకొక్కప్పుడు తనే ఆమెను గురించి ఇన్ని విధాలుగా తలపోస్తున్నాడుగాని ఆమెకు నిజంగా ఇవి ఏమీ పట్టవని అనుకునేవాడు. ఆమె తన దినచర్యల్లో అతని మీద ఏవిధమయిన అధిక అనురాగాన్ని గాని, చనువును గాని చూపించేది కాదు. అతని గదిని సర్దటానికిగాని శుభ్రం చేయటానికిగాని ఆమె స్వయంగా ప్రొద్దున్నే వస్తుంది. నిత్యమూ వస్తూనే ఉంటుంది. అయితే సుందరం ప్రొద్దునే నిద్ర లేవడు కాబట్టి చివరకు అతనిని క్రిందకు దొర్లించి అయినా సరే ఆమె తన పనిని పూర్తి చేసుకుపోయేది. డాక్టరుగారే ఆపని చేయమని ఆమెకు చెప్పారు.

అతడు ఆ యింట్లో పిల్లల నందరినీ సినిమాలకు తీసుకు వెళ్ళేవాడు. ఒక్కొక్క సారి శ్యామల ఒక్కదానినే తీసుకువెళుతుండేవాడు. వాళ్ళిద్దరే స్వయంగా వెళ్ళినరోజున ఇంటికి వచ్చేటప్పుడు నడిపించి తీసుకొస్తుండేవాడు. అతనికి రాత్రిళ్లు నడవటమంటే బహు సరదా. ఒకరోజున ఇట్లాగే ఆమెని సినిమాకు తీసుకువెళ్ళి తీసుకు వస్తున్నాడు. జంటగా ఇద్దరూ తారురోడ్డు మీద నడుస్తున్నారు. జనవరి నెల రాత్రి పది గంటలకు కొంచెం చలిగా ఉన్నది. ఒక్కసారిగా అతనిలో అనేకమైన భావాలు పుట్టుకు వచ్చినవి. అదే పట్టణంలో తను ఎన్ని సంవత్సరాలనుండి తిరుగుతున్నట్లు? కాని ఆ రాత్రి మాత్రం అంతా వింతగా సరికొత్తగా కనిపించింది. ఆ గాలిలో గాని, ఆ వాతావరణంలో గాని శ్యామలలోగాని ఏమి క్రొత్తదనం వచ్చిందో అతడు ఊహించలేదు. ఎందుకనో అతనిలో ఉత్సాహం ఉప్పొంగింది. ఆమె చేతిని మెల్లిగా దగ్గరకు లాగి ఒత్తాడు. ఆమె ఇంకా అతని దగ్గరకు వచ్చింది. తను చుట్టూ వాతావరణంలో అంత అందమూ, ఆ వెన్నెల రాత్రికి అంత సౌజన్యమూ ఉన్నట్లు అంతకుముందెన్నడూ అతడు గుర్తించలేదు. ఆమెని సరాసరి ఇంట్లోకి పోనీయకుండా తన గదిలోనికి తీసుకువచ్చాడు. అతడు ఈ బాహ్య ప్రపంచంలో లేడు. అతనిలో అణగారిపోయిన కోర్కెలు మరల ఒక్కసారిగా విజృంభించినవి. గడియవేసి లైటు ఆర్పాడు. (ఇవి అన్నీ అతడు తర్వాత నాకు స్వయంగా చెప్పాడు, చౌదరిగారికి సుందరాన్ని గురించి అసలు ఇటువంటి విషయాలు తెలియవు.)

మరుసటిదినము ప్రొద్దునే అతనికి నిదుర మెలకువ రాగానే రాత్రి జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. ఒక్కసారిగా గుండెలు కొట్టుకోసాగినవి. తను గదినుండి బయటకు రాగానే డాక్టరుగారు పిలచి సంజాయిషీ చెప్పమని అడుగుతారేమో! అన్నింటికన్నా ముఖ్యం ఆమె ముఖాన్ని ఏవిధంగా చూడటం? తను ఆ సమయంలో అంత మూర్ఖంగా ప్రవర్తించినందుకు, తనలో ఆ మాత్రం నిగ్రహం లేనందులకు తనలో తాను ఎంతో బాధ పడ్డాడు.

ఇంతలో ఆమె అక్కడకు రానే వచ్చింది. విసురుగా అతనిమీది దుప్పటి తీసివేస్తూ "ఇవ్వాళ ఒక సంతోషకరమైన వార్త. నాన్నగారు మిమ్మలని భోజనానికి ఇక్కడనే ఉండమని మరీమరీ చెప్పారు" అని అంది ఆమె సాధారణ స్వరంతోనే. ఆమె మాటల్లోగాని ఆమె చేతల్లోగాని ఏవిధమైన క్రొత్తదనమూ లేక చనవూ లేదు. ఆమె తనయందు కోపగించుకుంటుం దనుకున్నాడు. లేదా చివరకి తనను చూసి సిగ్గు అయినా పడుతుంది అనుకున్నాడుగాని ఆమె ఏమీచేయలేదు. రోజు అంతా మామూలుగానే జరిగిపోయింది. ఆ రోజుకు మల్లెనే అన్ని రోజులు జరిగిపోతున్నవి. ఆరోజు రాత్రి జరిగిన సంఘటన ఒక కలగా, జరగనట్లుగానే భావించాడు సుందరం.

కాని ప్రకృతి శక్తులు వారి అయిష్టాలకన్న బలవత్తరమయినవి. సుందరం ఆమెని కాలేజీ నుండి హోటల్‌కు తీసుకొచ్చి ఇద్దరూ కాఫీ సేవించుతూ ఉన్నారు. ఆమె కొద్దిదినాలనుండి అతనితో మూకీభావంగా ఉండటం అతను కనిపెట్టుతూనే ఉన్నాడు. అతను మాట్లాడబోతే సరి ఆమె ముఖం చిట్లిస్తున్నది. సుందరం అడిగాడు. ఆమె తనకేమి తెలియదని చెప్పింది. ఒక్కసారిగా అతని అనుమానాలన్నీ నిజమయినట్లు గ్రహించాడు. అతనికి అంతకుముందెన్నడూ అట్లా జరుగుతుందని కలలోగూడా అనుకోకపోయినా ఆమె విచారగ్రస్తమయిన ముఖాన్ని చూచేటప్పటికి అనుమానించాడు. భయంతో ఆమె పెదవులు వణికినవి. రాబోయే దుఃఖాన్ని దిగమ్రింగుతూ ఆమె అన్నది.

"నాకు ఇంకా సొంతం తెలియటంలేదు. నాన్నగారికి చెప్పటం మంచిదనుకుంటాను."

"ఇప్పట్లో చెప్పవద్దులే. దాన్నిగురించి ఏమీ విచారించకు. అంతా నేను సరి చేస్తాను" అని అన్నాడు సుందరం.

"తను ఎంత మూర్ఖుడు?" అని తనను తానే ప్రశ్న వేసుకున్నాడు సుందరం. తను ఒక పరమమూర్ఖుడు గాకపోతే మళ్ళా ఈ రొంపిలో ఇరుక్కోవట మేమిటి? అతనిలో నిగూఢంగా దాగిన కోర్కెలు ఫలించబోయే రోజులు వస్తున్నవి. మళ్ళా ఇంకొక చిక్కు. స్వతంత్రంగా జీవితం గడపాలని, దేశసేవ చెయ్యాలని, ఆర్టుకొరకు తనశక్తి అంతా ధారపోయాలని, ఇంకా ఎన్నోఎన్నో గొప్పగొప్ప కోర్కెలు పెట్టుకొన్న అతనికి మొదటినుంచీ ప్రతిబంధకాలే. అతడు దాదాపు పది సంవత్సరాలనుండీ ఇల్లువిడచి దేశదిమ్మరిలాగా, ఉద్యోగం కొరకయితేనేమి విప్లవనాయకుడుగానైతేనేమి తిరుగుతూ ఎన్నిఎన్ని కష్టాలు పడ్డాడు? చివరకు అవి అన్నీ విడిచి జీవితమంతా కళాసేవ చేస్తూ గడపాలనుకున్నాడు. ఇప్పుడు చేస్తూన్న ఉద్యోగం ద్వారా కొంత డబ్బు వెనకవేశాడు. ఇంకా కొద్దిరోజుల్లో ఉద్యోగం మానుకొని ఆ డబ్బుతో క్లుప్తంగా ఒంటరి జీవితం గడపాలనుకున్నాడు. అతడు ఎన్ని ప్రయాసలు పడ్డాడు ఆ ఒంటరి జీవితం కొరకు? ఒంటరిగా కళామయ జీవితం గడపటం యెంత ఆనందంగా ఉంటుంది? ఒంటరిగా సుదీర్ఘమయిన ఈ ప్రపంచాన్ని అంతటినీ చుట్టివస్తూ యిష్టము వచ్చినచోట్ల అల్లా ఆగుతూ, వచ్చిన ప్రదేశాలను చిత్రిస్తూ జీవితం ఎంతసంతోషంగా గడపవచ్చు? అతడు డాక్టరుగారి యింట్లో తన మంచంమీద పడుకున్నా సరే, తను బికారిగా ఉద్యోగం లేకుండా తిరుగుతున్న రోజుల్లో పబ్లికు పార్కు బెంచీలమీద పండుకున్నప్పుడయినా సరే అతడు అదే ఆలోచించేవాడు. ఆకర్షణీయమయిన ఈ ప్రపంచం చాలా విశాలమయినది. నేత్రపర్వమయినది. చక్కని ప్రకృతి సౌందర్యం, రామణీయకమైన అడవులతో గూడిన పసిఫిక్ దీవులు, మలయా. బర్మా దేశాలు అతని కళ్ళలో తిరుగుతుండేవి. ఫ్రెంచి విలాసము, స్పానిష్ అందమూ, రోము నగరం శోభ, జర్మన్ విజ్ఞానం అతని కళ్ళల్లో యెల్లప్పుడూ మెలగుతుండేవి. సోవియట్ రష్యా, రష్యాను చూడాలని తను ఎన్ని కలలు కన్నాడు! తను ఊహా సామ్రాజ్యంగా నిర్మించిన సోవియట్ రష్యాను చూడటానికి తను ఎంత ఉవ్విళ్ళూరాడు!

అమెరికా వెళ్ళాలి. అమెరికా అంటే అతని దృష్టిలో ప్రొఫెసర్ అయిన్‌స్టీన్. అమెరికా అంటే పాల్‌ముని. సరాసరి పాల్‌ముని దగ్గరకి వెళ్ళి "మానవులకి ఏవిధంగా అందించగలిగావయ్యా ఎమిలి జోలా యొక్క నిరంతర సత్యాన్వేషణ?" అని అడుగుదామనుకున్నాడు.

కాని ఇప్పుడు తన కోర్కెలన్నీ కోర్కెలుగానే నిలిచిపోవాలి. శ్యామల చెప్పిన దానిలో ఏవిధమయిన అబద్ధం ఉండదు. ఆమె చెప్పిన దానిలో అబద్ధం ఉండటానికి వీలులేదు. భగవంతుడు ఆమెకు అంత దేహం ఇచ్చింది పిల్లలని కనటానికి కాక మరెందుకు? ఆమెను అట్లాగా విడచి తను పారిపోతే? ఛీఛీ, తను ఇంతవరకు పరమ మూర్ఖుడు అయ్యాడుగాని పరమనీచుడు మాత్రం కాలేదు. కాని ఆమె ఒక్కదాని మూలకంగా తనయొక్క భవిష్యత్తు తన కోర్కెలు ఏ విధంగా నాశనం చేసుకోవటం? అతనిలో ఆమెకు నమ్మకం ఉన్నది. అతన్ని

ఎంతో దయతో చూస్తుంది ఆమె. డాక్టరుగారు అతన్ని ఎంతో దయతో చూస్తారు. తను బాధపడే రోజుల్లోనే కాకుండా డాక్టరుగారి స్నేహ సహాయపూరితమయిన దయ ఎల్లప్పుడూ అతనికి లభిస్తూనే ఉన్నది. అటువంటి డాక్టరుకు ద్రోహం చెయ్యటం అతడు తలంచవన్నా తలంచలేదు.

ఇటువంటి సమయంలో తను చేయగలిగిందంతా ఒక్కటే. ఏమిటంటే ఆమెను పెండ్లి చేసుకోవటం. డాక్టరుగారు ఎప్పుడూ అడ్డు చెప్పడు. డాక్టరుగారికి కావలసిందల్లా పెండ్లి చేసుకోబోయే భార్యా, భర్తా లిద్దరూ మంచి ఆరోగ్యవంతమైన పరిస్థితుల్లో ఉన్నారా లేదా అనే, అంతకు తప్ప ఆయన మిగతా విషయాలు పట్టించుకోడు. ఇంక తమిద్దరి సంగతి అవసరమే లేదు. తన తల్లితండ్రులు తన విషయాలను పట్టించుకున్నా తను వారివి పట్టించుకోడు. మెరపులా మెరసిన విషయంవల్ల అతనికి ఏమీ తోచిందికాదు. తను మేనేజిమెంటు చేస్తున్న పెద్ద టోబాకో కంపెనీకి సెలవుపెట్టి ఆ మధ్యాన్నమే శ్యామలకొరకు కాలేజీకి వెళ్ళాడు. ఆమెనుకూడా తీసుకొని ఇంక తను తమస్వగ్రామంవెళ్ళి తన ఇంట్లో తన కుటుంబం మధ్య సుఖంగా ఉండవచ్చు. పుట్టబోయేది ఆడపిల్ల అయివుండాలి. తమ కోడలిని చూచి తన తల్లితండ్రులు సంతోషించాలి. ఈవిధంగా ఎన్నో విధాల తలంచాడు సుందరం.

రెస్టరెంటులో ఒక గదిలో కూర్చున్నారు ఇద్దరూ. "ఆకలివేస్తూందా" అడిగాడు సుందరం.

"ఏమంతగా లేదు."

"అయితే ఇంకొంచెంసేపు ఇక్కడనే కూర్చుందాము" అన్నాడు.

"నీకు ఒంట్లో ఎట్లావున్నదీ?" అడిగాడు మళ్ళా. "ఏమీలేదు. భయపడవలసింది ఏమీ లేదు. లేడీ డాక్టరు పరీక్షచేసింది. అంతా ఉత్తదే" అని అన్నది ఆమె నవ్వుతూ.

"అతను ఒక్కమారుగా సంతోషంతో ఉప్పొంగిపోయాడు. మరొకపర్యాయం కోర్కెలన్నీ తలక్రిందులైనవి. అతనికి మరొకమారు ఛాన్సు చిక్కింది. అతనికి మళ్ళీ స్వేచ్ఛ దొరుకుతుంది. కాని అతని గుండె దిగజారిపోయింది. అతనికి తన జీవితంలో తన కోర్కెలను నెరవేర్చుకుంటానని ఆశ లేదు. ఎటు చూచినా నిరాశ. తన కోర్కెలకన్నా తన చుట్టూ ఉన్న వాతావరణ శక్తులు బలవత్తరమయినవి. వాటితో పోరాడి పోరాడి చివరకు ఈ నిముషాన గెలచాడు. కాని తన గెలుపును ఒప్పుకోలేదు. అతి ప్రయాసలతో కూడిన ఈ గెలుపుకన్నా ఓటమే మంచిది. అనుభవించితే జీవితం ఎక్కడయినా ఉన్నది. తెల్లటి హిమాలయ పర్వతాలమీద, తూర్పుదేశాల అరణ్యాల్లో, జపాను పూగుత్తుల్లో, అమెరికా హైవేస్‌లో, పారిస్ ఆర్టుస్కూల్సులోనే కాకుండా జీవితం ఎఱ్ఱని అగ్గిలో, తెల్లటివెన్నెలలో, అన్నిచోట్లా ఉన్నది. తను జీవితాన్ని అన్ని కోణాలనుంచి చూశాడు. తను తన తల్లితండ్రుల దగ్గిర ఉన్నప్పుడు చిన్న జమీందారుగా, గుంటూరులో విద్యార్థిగా, కొన్నాళ్ళు విప్లవ వీరుడుగా, తరువాత దేశదిమ్మరి, నిరుద్యోగి, బికారిగా, అన్నిరకాలు జీవితాలనీ చూచాడు. ఇంక తనకు కావలసిందల్లా సురక్షితంగా ఒడుదుడుకులు లేకండా ప్రశాంతంగా జీవితం గడపటం. శ్యామల అయితే తన జీవితాన్ని ప్రశాంతంగా నడుపుతుంది. తన కళామయ హృదయాన్ని గురించి తర్వాత చూడవచ్చును. ముందు ముఖ్యంగా కావలసింది తన జీవితం ఒడుదుడుకులు లేకుండా సుఖంగా నడవటం. ఆమె చేతిని నొక్కుతూ, "ఇవ్వాళ నిన్ను అడగాలనుకుంటున్నాను... మన పెళ్లి సంగతి" అని అన్నాడు నెమ్మదిగా.

"మన పెళ్ళా? అది ఎట్లా? మీరు పెళ్ళి చేసుకోమన్నారటగా? మా నాన్నగారు చెప్పారు. ఎక్కడికెక్కడికో పోవాలన్నారట" అని అంది ఆమె.

"ముందు నీకు ఇష్టమేనా?"

"నాకిష్టమేగాని మీకు ఇబ్బంది కలుగుతుందేమో!" అని అన్నది.

"నిన్ను విడచి ఎక్కడికి వెళ్ళతాను చెప్పు" అంటూ ఆమె కళ్లల్లోకి చూస్తూ నవ్వాడు సుందరం. అతని చూపులతో ఆమె చూపులు కలుసుకొన్నవి. వారిచూపుల ఏకీభవంలో వారి హృదయాలుకూడా ఏకీభవించినవి.